అర్హుల సంక్షేమానికే 'జగనన్న సురక్ష'

- అర్హులకు ధ్రువపత్రాల అందజేత
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కొత్తపేటలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు



మడికిలో అర్హులైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారుల బృందం



కేశనపల్లిలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీడీఓ వీరా స్వామినాయుడు

కొత్తపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి నూరు శాతం అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే ఈ 'జగనన్న సురక్ష' లక్ష్యమని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. కొత్తపేట సచివాలయం-4, వాడపాలెం సచివాలయం పరిధిలో అధికారులు సోమవారం 'జగనన్న సురక్ష' శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు బూసి జయలక్ష్మి, త్సామా బాబు అధ్యక్షతన జరిగిన సభల్లో అముడా చైర్మన్, ఎంపీపీలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అర్హులై ఉండి లబ్ధి పొందని వారు ఈ జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి కొత్తపేటలో 900, వాడపాలెంలో 1,400 మందికి ఆయా పత్రాలను ఉచితంగా జారీ చేయగా అధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, వైస్ ఎంపీపీ బండారు సత్యమంగతాయారు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ బడేమియా, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, సలాది బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

అలమూరు: అర్హులందరికీ ఇంటి ముంగిటకే వెళ్లి సంక్షేమ పథకాలను అందించడంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సత్వరమే మంజూరుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని జగనన్న సురక్ష మండల ఇన్‌చార్జిలు తమ్మన శ్రీనివాసు, నామాల శ్రీనివాసు అన్నారు. మండలంలోని మడికి-1, జొన్నాడ-1 గ్రామ సచివాలయాల పరిధిలో తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు యు.లక్ష్మీమౌనిక, కట్టా శ్రీనివాసు అధ్యక్షత వహించారు. జగనన్న సురక్షలో భాగంగా 11 పథకాలకు సంబంధించి మడికి-1 గ్రామ సచివాల పరిధిలో 859 మందికి, జొన్నాడ-1 గ్రామ సచివాలయ పరిధిలో 425 మందికి ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అక్కడికక్కడే అందజేశారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ నాంద్ర నాగమోహన రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం.పోశమ్మ, డీటీ ఎం.జానకి రాఘవ, పంచాయతీ కార్యదర్శి ఎం.మోక్షాంజలి తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా గ్రామంలో అర్హత ఉండి ధ్రువపత్రాలు పొందని లబ్ధిదారులకు ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు, నియోజకవర్గ జగనన్న సురక్ష కన్వీనర్ చింత రాజబాబు చేతుల మీదుగా 972 సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ యెనుముల నాగు, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి, సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి, గ్రామశాఖ అధ్యక్షులు యడ్ల జయకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురు: సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టిందని తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మగటపల్లి, గోగన్నమఠం గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. మగటపల్లిలో సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి చేతుల మీదుగా 1712 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందించారు. గోగన్నమఠంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు భూపతిరాజు లక్ష్మి, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి చేతుల మీదుగా 956 సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, భూపతిరాజు సత్తిబాబురాజు, సూరిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గోపాలపురం సచివాలయాలు 2,3 పరిధుల్లో జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ సబ్బితి మోహనరావు, మాజీ ఉప సర్పంచ్ చిర్ల రామచంద్రారెడ్డి తదితరులు ముఖ్యఅతిథులుగా మఖ్యూజరై మాట్లాడారు. ఈ క్యాంపుల్లో 11 రకాల వివిధ సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు.

ఆత్రేయపురం: మండలంలోని వద్దిపర్రులో సోమవారం జెడ్పీటీసీ బోణం సాయిబాబా, కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీడీఓ నాతిబుజ్జి, కొరుప్రోలు వెంకటేశ్వరరావులు ప్రజలకు అవసరమైన 1490 ధ్రువపత్రాలను ప్రజలకు అందించారు.

క్లుప్తంగా

చిత్రకారుడు శ్రీనివాస్‌కు 'ఎన్టీఆర్ గోల్డెన్ బ్రష్' అవార్డు



అవార్డు అందుకున్న చిత్రకారుడు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

మలికిపురం: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన చిత్రకారుడు నల్లి శ్రీనివాస్ 'ఎన్టీఆర్ గోల్డెన్ బ్రష్ అవార్డు' దక్కించుకున్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 'క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు అంజి ఆకొండి నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్టీఆర్ చిత్రకళా పోటీలో పాల్గొన్న శ్రీనివాస్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును జూలై 9న విజయవాడలో జరిగిన బహుమతి ప్రదానంలో 'జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుందర్ కుమార్ గారి చేతుల మీదుగా అవార్డు, సర్టిఫికెట్ అందుకున్నారు.

డాగూరే సేవలు చిరస్మరణీయం



పి.గన్నవరంలో డాగూరే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

పి.గన్నవరం: ఫొటో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘ నాయకుడు తోట రామకృష్ణ అన్నారు. స్థానిక అక్విడెక్టు వద్ద సోమవారం డాగూరే వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. మండల ఫొటో గ్రాఫర్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు గూటం శ్రీనివాసరావు, పెనుమాల బాలాజీ, నూకపెయ్యి రాజు, కడలి శ్రీనివాసరావు, తామరపల్లి రాజా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

అంబాజీపేట: ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలతో భవనాన్ని నిర్మించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ముక్కామలలో నూతనంగా నిర్మిస్తున్న పశువుల ఆస్పత్రి నిర్మాణ పనులను ఎంపీపీ సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ.32 లక్షలతో పశువుల ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పశువుల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు చేపట్టకుండా గాలికొదిలేశారన్నారు. ఎట్టకేలకు ఆస్పత్రి భవనం ఏర్పడటంతో రైతుల నిరీక్షణకు తెరపడిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ, అగ్రికల్చర్ మార్కెటింగ్ ఏఈ ఎం.శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు.

ప్రతాప్ సేవలు ప్రశంసనీయం

సఖినేటిపల్లి: శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సాహిత్య సేవలు ప్రశంసనీయమని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జె.గౌరీశంకర్ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన పర్యవేక్షణలో హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్‌లో జాతీయ కవి సమ్మేళనంలో భాగంగా కలాలు, గళాలు కార్యక్రమం నిర్వహించారు. వివరాలను సోమవారం వీవీ మెరకలో డాక్టర్ ప్రతాప్ మీడియాకు తెలిపారు. సుమారు 250 మంది కవులు ఈ సమ్మేళనంలో పాల్గొని కవితాగానం చేశారు. సమ్మేళనంలో ఈ మేరకు సాహిత్య సేవలు చేస్తున్న డాక్టర్ ప్రతాప్‌ను, గౌరీశంకర్ సత్కరించారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో వందకు పైబడి జాతీయ శతాధిక కవిసమ్మేళనాలు నిర్వహించిన ఘనత డాక్టర్ ప్రతాప్‌కు దక్కిందని గౌరీశంకర్ తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల జిల్లా కోఆర్డినేటర్‌గా రవీంద్ర



రావులపాలెం: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న గ్రామ సచివాలయ, వార్డు ఉద్యోగుల ఐక్యతకు కలసికట్టుగా అందరూ ఉండాలని, ఈ దశలో భాగంగా జిల్లా కమిటీ నిర్మాణం చేయనున్నట్టు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోఆర్డినేటర్ బూసి రవీంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నుంచి సోమవారం ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు రవీంద్ర తెలిపారు.

సహజ యోగాతోనే సర్వమానవాళికి ఆనందం

అయినవిల్లి: సర్వమానవాళి ఆనందంగా ఆరోగ్యంగా ఉండటానికి సహజయోగా ధ్యానం అవసరమని జిల్లా కోఆర్డినేటర్ నెహ్రూ అన్నారు. సోమవారం వీరవల్లిపాలెంలోని ధ్యాన కేంద్రం ఎనిమిదో వార్షికోత్సవం కోఆర్డినేటర్ ముద్రగడ నాగారావు అధ్వర్యంలో సహజయోగా సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు 200 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమం సహజయోగా ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ అధ్వర్యంలో జరుగింది. రాష్ట కమిటీ సభ్యులు రామారావు, పద్మావతి, రాధా తదితరులు ఉన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి వి.గౌతమి అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఉచితంగా ఐరెన్ మాత్రలు, సిరప్‌లను పంపిణీ చేశారు.

మహిళకు ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న రోజారమణి

మామిడికుదురు: మగటపల్లికి చెందిన కుసుమ సత్యవతికి ఆదర్శ ఆంధ్ర యూత్-కువైట్ విభాగం సోమవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించింది. రాజోలు మార్కెట్ కమిటీ చైర్మన్ గుబ్బల రోజా రమణి చేతుల మీదుగా ఈ సహాయాన్ని ఆమెకు అందజేశారు. నిలువ నీడ లేని ఆమె కూలీ పని చేసుకుంటూ తన కొడుకుని చదివించుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఆదర్శ ఆంధ్ర యూత్-కువైట్ విభాగం మానవతా దృక్పథంతో స్పందించి సాయం అందించింది. మార్కెట్ కమిటీ చైర్మన్ ఒక చీరను అందించారు. కార్యక్రమంలో నల్లి రాజ్‌కుమార్, తాడి సహదేవ్, కొల్లాబత్తుల చిట్టిబాబు, గుబ్బల మనోహర్, సూరిశెట్టి బాబి పాల్గొన్నారు.

కేసుల కొట్టివేత హామీపై హర్షం

అయినవిల్లి: గత టీడీపీ ప్రభుత్వం 2017 కురుక్షేత్ర మహాసభ జరిగినప్పుడు మాదిగ విద్యార్థులపై అక్రమ కేసులు మోపింది. దీనిపై సీఎం జగన్‌ను మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ తదితరులు సీఎం జగన్‌ను కలిశారు. ఈ మేరకు వారికి కేసుల కొట్టివేతపై వారికి హామీ ఇవ్వడంతో మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కె.జగన్నాథపురంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చేట్ల రామారావు, ఆకుమర్తి దుర్గారావు, నేదునూరి నానా, మల్లవరపు భాస్కరావు, నేదునూరి ధనరాజు, మడికి సతీష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొత్తపేట: మండలంలోని గంటిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి స్థానిక ఏఎస్సై డి.శశాంక తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.గన్నవరానికి చెందిన కుడుపూడి శ్రీనివాసరావు ఆటోలో అదే గ్రామానికి చెందిన మట్టపర్తి ధనలక్ష్మి అనే మహిళ ఆదివారం రావులపాలెం వెళుతుంది. గంటి సెంటర్‌కు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ధనలక్ష్మి, ఆటో నడుపుతున్న శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

కొబ్బరి పీచు బొమ్మల తయారీని ప్రోత్సహిస్తాం



కొబ్బరి పీచు బొమ్మను పరిశీలిస్తున్న పార్టీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్ మిథున్‌రెడ్డి

మామిడికుదురు: కొబ్బరి పీచు బొమ్మల తయారీని ప్రోత్సహిస్తామని ఎంపీ, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పి.మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారని వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్‌రాజా తెలిపారు. కోనసీమ మహిళలు కొబ్బరి పీచుతో తయారు చేస్తున్న బొమ్మలను రాజా సోమవారం రాజమహేంద్రవరంలో మిథున్‌రెడ్డికి చూపించారు. పీచు బొమ్మలను ఆసక్తిగా తిలకించిన ఎంపీ వాటిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన మహిళలను అభినందించారని చెప్పారు. హస్త కళలను ప్రోత్సహించే విధంగా కోనసీమలో కొబ్బరి పీచు పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలని కోరానన్నారు. దానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. కొబ్బరి పీచు బొమ్మల తయారీని కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారని గౌతమ్‌రాజా తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి



నాగుల్లంకలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: సీఎం జగన్ దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నాగుల్లంకలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులు మంగం చిట్టిబాబు, కారుపల్లి శ్రీను, బొక్కా ఏడుకొండలు, చికిలే వెంకటేశ్వర రావు, చికిలే ప్రసాద్ తదితరులతో చిట్టిబాబు ఇంటింటికీ ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగన్ పాలనలో కలిగిన లబ్ధిని కుటుంబాల వారీగా తెలియజేశారు. జగన్‌కు ప్రజల నుంచి లభిస్తున్న విశేష ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లు కడుపుమంటతో రగిలిపోతున్నారని విమర్శించారు. ఎల్లో మీడియాతో కలసి ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని చిట్టిబాబు అన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, పార్టీ నాయకులు గ్రంధి సోమేశ్వరరావు, ముడకల ఏసురత్నం, ఆకుమర్తి రమేష్, జోగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'జగనన్న గోరుముద్ద'



కొత్తపేట జీబీహెచ్‌లో మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలిస్తున్న ఎంఈఓ

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి బలవర్ధకమైన ఆహారం అందించాలి. వారు సంపూర్ణ ఆరోగ్యంతో చదువుకోవాలి అనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం పకడ్బందీగా అమలు జరగాలని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, తరగతులు నిర్వహణ తదితర విభాగాలు పరిశీలించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షించారు. గోరుముద్దలో పోషకాలు తద్వారా ఆరోగ్యం గురించి విద్యార్థులకు, పేరెంట్స్ మీటింగుల్లో వారికి వివరించడం ద్వారా పిల్లలందరూ గోరుముద్ద తినేలా చూడాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం అల్లూరి గోపాలరాజు, సీఆర్‌పీ వీడీ మనోహరి తదితరులు పాల్గొన్నారు.

వినూత్న వేషధారణలో అవగాహన



మడికిలో యమధర్మరాజు వేషధారణలో అవగాహన కల్పిస్తున్న హైవే అధికారులు

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిలోని మడికి వద్ద ఆ శాఖాధికారులు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వినూత్న రీతిలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్‌హెచ్ఆర్ఈ అప్పలనాయుడు, టోల్ మేనేజర్ కేవీపీఎస్ఎన్ రెడ్డి, ప్లాజా మేనేజర్ నెహెమియా ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు పండ్ల మార్కెట్ దగ్గర నుంచి కోనసీమ జిల్లా గోపాలపురం వరకు పర్యటించారు. నిబంధనలు అతిక్రమిస్తే సత్వరమే నేనొస్తానంటూ యమధర్మరాజు వేషధారణలోనున్న హైవే అధికారి వాహనదారులను హెచ్చరించారు. ద్విచక్ర వాహదారులందరూ హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్ట్ పెట్టుకోవాలని మద్యం తాగి వాహనాలను నడపరాదని సూచించారు. హెచ్‌ఓ యు.రవితేజ, ఐఎం మేనేజర్ విజయ్, ఆఫీసర్ రమేష్, సేఫ్టీ మేనేజర్ రాజా, హెచ్ఆర్ రమేష్, స్థానిక పోలీస్ శాఖ పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమయ్యే రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. చిరతపూడిలో కొత్త కాలనీ నుంచి లంకవారిపేట వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్, వైస్ ఎంపీపీలు సోమవారం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అధ్వానంగా ఉన్న రహదారిని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఎమ్మెల్యే చిట్టిబాబు ఆదేశాల మేరకు సచివాలయం నిధులతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార చిట్టిబాబు, బొద్దు అప్పాజీ, బోడే ఏసు, లంక దేవానంద్, శియోన్ ఆజు, కాటంరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా పండగ వాతావరణం



శృంగవరప్పాడులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటా పండగ వాతావరణ వెల్లివిరుస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం శృంగవరప్పాడు సత్తెమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుంచి ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. చిన్న, చిన్న కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ రావి నాగ వెంకటలక్ష్మీదేవి, ఎంపీటీసీ యెనుముల కొండమ్మ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు మద్దాల భాను, నాయకులు గెడ్డం అమ్ములు, కె.చిట్టిబాబు, రావి త్రిమూర్తులు, కార్యదర్శి గంగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



చింతలపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి వేదికగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిలుస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం చింతలపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే రాపాక శంకుస్థాపన చేశారు. గతంలో చింతలపల్లిలో గడపగడపకూ కార్యక్రమం చేపట్టిన సమయంలో స్థానికులు రోడ్ల నిర్మించాలని అభ్యర్థించారన్నారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ మట్టా శైలజ, మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, నాగబాబు, ఇంటిపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాన్ని తమకు అప్పగించాలి



పి.గన్నవరంలో ఆందోళన నిర్వహిస్తున్న వర్తక సంఘ సభ్యులు

పి.గన్నవరం: ఆక్రమణకు గురైన వర్తక సంఘ స్థలాన్ని తిరిగి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ పి.గన్నవరంలో సోమవారం వ్యాపారులు షాపులు మూసివేసి, ఆందోళన నిర్వహించారు. స్థానిక రైసు మిల్లు యజమాని తమ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత తాటమ్మ ఆలయం వద్ద వర్తకులు సమావేశమయ్యారు. సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తెలగారెడ్డి అగ్ని సుబ్బారావు, దొమ్మేటి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ పి.గన్నవరంలో ఏటిగట్టును ఆనుకుని ఉన్న రైసు మిల్లు పక్కన 1999లో గ్రామ పంచాయతీ సీతారామ వర్తక సంఘానికి ఐదు సెంట్ల స్థలాన్ని ఇచ్చిందన్నారు. రైసు మిల్లు యజమానులు ఆ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారని తెలిపారు. దీనిపై గత నెల 26న స్పందనలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించి, తమ స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. దీంతో ఒక రోజు పని ఆపి, మళ్లీ నిర్మాణం కొనసాగిస్తున్నారన్నారు. తర్వాత అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో షాపులు మూసివేసి, ఆందోళన చేపట్టినట్టు తెలిపారు. ఆక్రమణకు గురైన స్థలం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వెళ్లి స్పందనలో డీటీ బి.గోపాలకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని తమకు అప్పగించాలని, వ్యాపారుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. సంఘ కార్యదర్శి ఆర్.కోటేశ్వరరావు, నాయకులు దాసరి కాశీ, గిడుగు బాబ్జీ, యడ్లపల్లి రాము, అంబటి శ్రీను, కట్టా గోపి, బి.వెంకటేశ్వరరావు, సీహెచ్ నాగరాజు, తమ్మన ప్రసాద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్లకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి



నగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



ముక్తేశ్వరంలో పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు వలంటీర్ల నిరసన

మామిడికుదురు: వలంటీర్లను అవమానించే విధంగా మాట్లాడిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు డిమాండ్ చేశారు. నగరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్య సమాజం సిగ్గుపడే విధంగా పవన్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సేవలందిస్తున్న వలంటీర్లను కించపర్చడం పవన్ దిగజారుడుతనానికి నిదర్శనమని చిట్టిబాబు పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, పార్టీ నేతలు కుసుమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యల పై సోమవారం ముక్తేశ్వరంలో వలంటీర్లు నిరసన తెలిపారు. పవన్ కల్యాణ్ చిత్రపటాలను వలంటీర్లు దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

మలికిపురం: ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న వలంటీర్లను జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అవమానించడం విచారకరమని నియోజకవర్గానికి చెందిన పలువురు వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 30 వేల మంది అమ్మాయిలు కనిపించడం లేదని పవన్ అనడం హాస్యాస్పదమని వలంటీర్లు పేర్కొన్నారు. అలాగే దిండి వద్ద జాతీయ రహదారిపై వలంటీర్లు పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

అంబాజీపేట: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని లేని పక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని అంబాజీపేట మండల వలంటీర్ల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో మండల వలంటీర్లు పవన్ వ్యాఖ్యలపై సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై ఎ.చైతన్యకుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

ఆలమూరు: వలంటీర్లపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని గ్రామ వలంటీర్ల సంఘ ప్రతినిధి జి.ధనుంజయ్ హెచ్చరించారు.

రావులపాలెం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ తమకు క్షమాపణలు చెప్పాలంటూ వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం మండలంలోని రావులపాడు గ్రామానికి సంబంధించిన వలంటీర్లు సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కుసుమే విజయ్ కుమార్, దాసు ప్రతాప్, కేతా సాగర్, గెడ్డం అఖిల్ తదితరులు పాల్గొన్నారు.